# అక్కయ్యపెళ్ళి

నెల్లూరి కేశవస్వామి.

## 1



విజయపురి నార్త్
1 ఏ జనవరి 1961

ప్రియమైన విశాల అక్కయ్యకు,

సమస్కారములు చేసి వ్రాయునది ఏమనగా ఇక్కడ అంతా క్షేమము. మీ క్షేమ సమాచారములు తెలియజేయ గలవు. ఇదివరలో రెండు మూడు ఉత్తరములు వ్రాసియుంటిని, కాని వాటికి ఇంతవరకు జవాబు రాలేదు. నిజముగానే నీకు బొత్తిగా తీరుటలేదా, లేక మమ్మలను మరచిపోయితివా? నాన్నగారికి కూడా ఒక లేఖ వ్రాసితిని. కాని దానిని వారు చించి చదువుకొనిరో లేదో తెలియదు. ఇప్పుడు వారిస్థితి ఎట్లావున్నది? మునుపటివలెనే మౌనముగా కూర్చుని వుందురా? నాన్నగారిని తలచుకున్నప్పుడల్లా నాగుండె తరుక్కుపోవుచుండును. అమ్మపోవటము నిజముగా మన దురదృష్టమే. మొన్న మీ మరిదిగారు చెప్పినారు ఇంగ్లీషు వైద్యులలో మనస్సుకు సంబంధించిన రోగాల వైద్యులుకూడా వుందురట. నాన్నగారిని వారికి చూపించిన

యడల బాగుపడవచ్చునని అన్నారు.. ఈ విషయము నీకు తెలిసియే యుండును. మన ఎదురింటి డాక్టరుమావయ్యగారి సలహా కూడా తీసుకొని ఎదో ఒకటి త్వరలో చేయుధ్ధువని నమ్ముచున్నాను.

ఈ దినము మేము క్రొత్తసంవత్స రము పండుగ చేసుకున్నాము. మీ మరిది గారు ఇంటిలోనే వున్నారు. వారు ఎప్పటి వలెనే తమపనిలో మునిగితేలుతూ వుందురు. ఇతర ప్రపంచముతో పనియే లేదు. అయినా అప్పుడప్పుడు నీ గురించీ, నాన్నగారి గురించీ తలచుచుందురు. బాబు కులాసాగానే వున్నాడు. వచ్చే ఆదివారము, అనగా 8వ జనవరినాడు వాడి పుట్టిన దినము. మూడు సంవత్స రములు నిండుతవి. పూరికే పెద్దమ్మ దగ్గరికీ, తాతయ్య దగ్గరికీ వెళ్ళుతానంటూ మారాము చేస్తూవుంటాడు.

తమ్ముడు రామం దగ్గరనుంచి ఉత్త రములు వస్తున్నవా? వాడు పైచదువు లకు అమెరికా వెళ్ళినప్పటినుంచీ నాకు ఒక్క కార్డుముక్క అయినను వ్రాయ లేదు. అక్కడ ఎట్లా ఉన్నాడో ఏమో నాకు బెంగగానున్నది. దయచేసి వాని అడ్రసు తెలుపగలవు.

నీ గురించి నా మనస్సులో ఎంత దిగులుగా నున్నదో నీవు వూహించలేవు. నీ కంటే నేను చిన్నదాననైనప్పటికీ నేనేమో పెళ్ళిచేసుకొని సుఖముగా సంసారము చేయుచుంటే నీవేమో ఇంకా అవివాహితగా నుండుట ఎంతవరకు సమంజసముగా నున్నదో నీవే యోచించ గలవు. ఇంకా ఎన్నాళ్ళీ వొంటరిపాటి జీవితము? అమ్మ బ్రతికివున్నన్నాళ్ళూ చదువు మిషపైన పెళ్ళిచేసికోనని మొండి పట్టు పట్టితివి. ఇప్పుడిక చదువు అయి పోయినవెంటనే ఉద్యోగములో చేరితివి. నిజముగా నీకు ఉద్యోగము ఎందుకో చెప్పు? నాన్నగారు అమ్మపోయినప్పటి నుంచీ అట్లా అయిపోయిరి. తమ్ముడు పరదేశములకు వెళ్ళిపోయెను. నేనేమో దూరమై పోతిని. ఇక నీ విషయము చూచేదెవరు? ఇకనైనను నీ మనస్సు మార్చుకొని త్వరలోనే ఒక ఇంటిదానివి కాగలవని నేను వేయిదేవుళ్ళకు మ్రొక్కని దినములేదు. నేను చిన్నదానిని, ఇంత కంటే ఎక్కువచెప్పే అధికారము నాకు లేదు.

క్రిందటి దీపావళి పండుగకు నేను మన ఇంటికి వచ్చినప్పుడు, నీ కొరకు ఒకతను వచ్చినాడు. నీ స్నేహితుడని పరిచయము చేసినావు. పేరు మరచినాను. అతను మంచివాడివలెనే తోచినది. ఒక వేళ నీవు అతనిని వివాహము చేసికొన దలచిన మాకు అభ్యంతరము వుండదు, ఆలోచించుకొనుము.

ఇంతే సంగతులు. ఈ వుత్తరమున కైనను బదులు వ్రాయుదువో లేదో నీ దయ.

మీ మరిదిగారు తమమావగారికి, వదినెగారికీ నమస్కారములు అందజేయమని చెప్పినారు. బాబుకూడ తీపి తీపి ముద్దులు పంపించుచున్నాడు.


ఇట్లు
నీ చెల్లెలు
విజయ

**2**

హైద్రాబాద్
10-1-1961

చెల్లాయి విజయా :

Wish you a Happy New year! ఈ కొత్త సంవత్సరంలోగా ఓ కొత్త కొడుకునో కూతుర్నో కనేస్తావుకదూ ? కాదు, కాదు... 'ఈ క్రొత్త సంవత్సరంబునందు కొంగ్రొత్త తనయుడినో, తనయనో కనెదవని ఆశించుచున్నాను..' అవునా ? నువ్వైతే అలాగే రాసేదానివి కదూ ? ఏఁవిటే ఆ కలగాపులగంభాష ? ఎవరే నీకలా వుత్తరాలు రాయటం నేర్పింది ? అమ్మే కదూ ? అవును, ఇంగ్లీషురాని అమ్మకూడా అలాగేరాసేది. మరి నువు స్కూలుఫైనలు పాసయావు కదా, నువ్వూ అంతేనా ? అవున్లే, ఆ నాడు కాలేజీలోచేరమని నేను ఎంతచెప్పినా విన్నావూ ? అమ్మమాటే వేదవాక్యంలాగా, అమ్మతెచ్చిన మొగుణ్ణి కట్టుకుందుకు వెళ్ళి పెళ్ళిపీటలమీద కూచున్నావు.... పోన్లే, నేనిలా రాస్తున్నానని నొచ్చుకోకేం ?



"ఏనుగుకూ దోమకూ ఉండే తేడా ఏమిటిరా?"
"ఏనుగుల్ని దోమలు కుట్టగలవు, ఏనుగులు దోమల్ని కుట్టలేవు."

విజ్జీ : నిజంగా నీ మనస్సు వెన్నపూసలాంటిది సుమా. బాధలన్నీ తెచ్చిపెట్టుకొని కరిగిపోతుంటావు. నాన్నారి గురించి నీ కెందుకంత బాధ? అసలు వారి కేమైందనీ ? వేళకు భోజనమూ, నిద్రా, పత్రికా పఠనమూ అన్నీ సవ్యంగానే సాగుతున్నాయి. నెల నెలా పెన్షన్ కాగితాలమీద కూడా సరిగ్గానే సంతకాలు చేస్తారు. ఎటొచ్చీ ఎవరితోనూ మాట్లాడరు. ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోరు. అంతేనా ? అంతమాత్రానికే ఏమో అయిపోయిందని గగ్గోలుపడిపోవాలా ? సైక్యాట్రిస్టుకు చూపించమని చెప్పారా మరిదిగారు ? ఆయనగారి సలహాకు థ్యాంక్స్. అసలు సైక్యాట్రిస్టు అంటూ ఒకడు మన దేశంలో వున్నాడటనా ? అవన్నీ పాశ్చాత్యులకు

మనకెందుకూ? చూడుచెల్లాయ్ : నాన్నారికేమీ కాలేదు, నిక్షేపంలా వున్నారు. అప్పుడప్పుడు డాక్టరు మాంవయ్యచేత పరీక్ష చేయిస్తూనే వున్నాను. వారి ఆరోగ్యం చెక్కుచెదరకుండా వుంది. నేనంతా చూసుకుంటూనే వున్నాగాని నువ్వేమీ అనవసరంగా దిగులుపడకు.

పోతే, రామం విషయం. వాడేం చిన్నపిల్లవాడా? ఇరవై ఏళ్ళు వచ్చాయి. వాడి సంగతి వాడు చూసుకోలేడూ? నామల్లేనే వుత్తరాలు రాయటమంటే వాడికీ బద్ధకమే. అంతమాత్రానికే ఇదై పోవాలా? అడ్రసు ఇప్పుడు కనిపించటం లేదు. మళ్ళీ రాస్తాలే.

ఇహపోతే, నేను. నిజంగా చెల్లాయ్! నా పెళ్ళి గురించి నువ్వింతగా బాధపడుతున్నావని నే నెన్నడూ అనుకోలేదు సుమా. అసలు నాకు పెళ్ళికాకపోవటం మరొకరికి బాధాకరంగా వుంటుందన్న వూహేరాలేదు నాకు. అయితే ఒక్క సంగతి. అప్పుడు చదువుకోసం నేను పెళ్ళిచేసికోనన్న మాట నిజమే, కాని ఎప్పటికీ పెళ్ళిచేసుకోక బ్రహ్మచారిణిగానే వుండిపోతానేమోనని నువ్వనుకుంటున్నట్టున్నావు. అలా కాదు. నేను పెళ్ళి చేసుకుంటాను, తప్పకుండా చేసుకుంటాను. సమయం రావాలి, అంతే. ఇప్పుడేనా నీకు మనశ్శాంతి కలిగిందా?... ఆఁ, అప్పుడు దీపావళికి మన ఇంటికెవరో వచ్చారని రాశావు. ఎంత జ్ఞాపకం చేసుకున్నా ఎవరో అంతు దొరకటంలేదు. కాని అతణ్ణి నేను పెళ్ళి చేసుకుంటానన్న భావన నీ కెందుకు కలిగిందో నాకు అర్థంకాకుండా వుంది. చూడు విజ్జీ! నేను కాలేజిలో చదువుకున్నాను, వుద్యోగం చేస్తున్నాను. కొంతమంది మగస్నేహితులు కూడా అప్పుడప్పుడు ఇంటికి వస్తూనే వుంటారు. అంతమాత్రాన ఆ వచ్చిన వాడినల్లా పెళ్ళి చేసుకుంటానేమో అనుకుంటే ఎట్లా?... ఇప్పుడుగనక నువ్విక్కడుంటే సుందరరావుని చూసి నువ్వేమనుకునే దానివో. సుందరరావు అంటే బియ్యేలో నా క్లాసుమేటు. ధనవంతుల బిడ్డ. ఎమ్మే పాసయ్యాడు. ఉబుసుపోక పి. హెచ్. డీ. కూడా చేస్తున్నాడు. కాలేజీలో నా స్నేహం కోసం ఎంతో తాపత్రయపడేవాడట. కాని నేనే వీలుపడనీయలేదట. అతనిప్పుడు చెప్పిందాకా తెలీదు. ఇప్పుడు మనింటికి తరచూ వస్తున్నాడు. మనిషి బాగానే వుంటాడు. ఇంకా పెళ్ళికాలేదు. నేను 'ఊఁ' అంటే నా మెళ్ళో మంగళసూత్రం కట్టేలాగున్నాడు...

ఈ గొడవంతా ఎందుకుగాని బాబు సంగతి చెప్పు, మొన్నవాడి పుట్టిన్రోజు పండుగ జరిపించావా? నేను పంపించిన ప్రెజెంట్ అందిందా? మన శాయన్న చేత పార్సిలు చేయించాను. బాబును చూడాలని వుంది. సంక్రాంతికి రారాదూ? వీలైతే మీఆయన్ని కూడా రమ్మను.

మూడు రోజులు శెలవులిస్తారుగా. కనీసం నువ్వో బాబైనా రండి. పండుగవగానే నువ్వెళ్ళిపోవొచ్చు. బాబును ఇక్కడే వుంచేసెయ్. వాడికి మూడేళ్లు నిండినైగా. ఏదైనా Kindergarten లో చేర్పిద్దాం. నేను చూసుకుంటాలే, ఏమంటావ్ ?

ఇక ఆపుతాను. ఇలా రాసుకుంటూ పోతే ఎంతకూ తెమిలేట్టు లేదు. మరిది గారికి ప్రతినమస్కారాలు. బాబుకు ముద్దులు. నీకు...? నీకేం రాయనూ? నిన్ను దీవించేంత పెద్దదాన్ని కానే? పోనీ, మరోసారి, ఈ కొత్త సంవత్సరంలో నీ కొక కొత్త కొడుకు కలగాలని కోరుకుంటాను. ఎందుకో తెలుసా? అప్పుడు బాబును నాకిచ్చేస్తావేమోనని ఆశ! ఏం, ఇస్తావా?...

ప్రియమైన అక్కయ్య
విశాల

3

విజయపురి నార్త్
13 వ జనవరి 1961

ప్రియమైన విశాల అక్కయ్యకు,

నీవు 8 వ తారీకున వ్రాసిన ఉత్తరము నిన్ననే అందినది. సంగతులు తెలిసినవి.

నీవలె నేను వ్రాయలేను ఎల్లి! నాకు వచ్చిన రీతిగనే నన్ను వ్రాయనియ్యి. నా వ్రాత మూలముగనైనా నీకు అమ్మ జ్ఞాపకము వచ్చుచున్నది. నాకదే సంతోషము.

నీ ఉత్తరాన్ని పదే పదే చదువుకున్నాను. ఎన్నిసార్లు చదివినా తనివి తీరలేదు. నా మనస్సు ఎంత ఉప్పొంగి పోయినదో నేను వర్ణించలేను. వెంటనే రెక్కలు కట్టుకుని నీ దగ్గిర వాలాలనీ, ఒకసారి శ్రీ సుందర్రావుగారిని చూడాలనీ వున్నది. కాని ఏమి చెయ్యను? వీలులేదు. ఇక్కడేవో లేబరు గొడవలు మొదలైనాయట. మీ మరిదిగారు సరిగ్గా భోజనానికే రావటములేదు. ఇట్లాంటి పరిస్థితులలో నేను మాత్రము వారిని వదిలి ఎట్లా రాగలను, చెప్పు...?

నీవు తప్పకుండా పెళ్ళిచేసికుంటా నన్న నిశ్చయానికి వచ్చినావు. నాకు అదే పదివేలు. శ్రీ సుందర్రావుగారి గురించి నీ అభిప్రాయము బాగానే ఉన్నట్టుగా నున్నది. ఇక ఆలస్యము దేనికీ? నీ ఇష్టమే మా ఇష్టము. నీ తుది నిశ్చయము తెలియగానే నేను మా వారిని వెంటబెట్టుకొని అక్కడికి వచ్చెదను. తక్కిన విషయములన్నీ మేము చూచుకొనెదము.

బాబుకు నీవు పంపించిన రైలు బహుమతి సకాలముననే అందినది. దానిని వాడు వదలకుండా ఆడుకుంటూన్నాడు. అందులో కూచుని నీ దగ్గిరికి వెళ్తానంటూంటాడు. అక్కయ్యా! బాబు నీవాడే.

బాబువి థాంక్స్, ముద్దులు. మీ మరదిగారికి నమస్కారములు. నాన్న

గారి సంగతి వ్రాస్తూ వుండుము రామం అడ్రసు దొరికితే తెలపగలవు ఇంతే సంగతులు

ఇట్లు
నీ చెల్లాయి
విజయ

**4**

విజయపురినార్త్
20 వ ఫిబ్రవరి 1961

ప్రియమైన విశాల అక్కయ్యకు

నీ జాబు కొరకు చూసి చూసి కళ్ళు కాయలు కాసినవి వెంటనే రాయగలవు ఇక్కడంతా క్షేమము

ఇట్లు
విజయ

**5**

హైదరాబాద్
2[illegible] 2 61

విజయా!

ఒక దుఃఖవార్త మన ఎదురింట అత్తయ్యలేదూ, డాక్టరు మావయ్యభార్య మొన్న అకస్మాత్తుగా గుండె ఆగి చని పోయింది అప్పుడు ఇంట్లో ఎవ్వరూ లేరు మావయ్య క్లబ్బుకెళ్ళాడు వాళ్ళ నౌకరు పరుగెత్తుకొచ్చి నాకు చెప్పాడు మావయ్య వచ్చేప్పటికే అంతా అయి పోయింది నేనె శ్యామలకూ వాళ్ళ అన్నయ్య మూర్తికీ, టెలిగ్రాంలిచ్చాను మూర్తి ఇప్పుడు బెంగుళూరులోని హిందుస్తాన్ ఏర్‌ఫ్యాక్టరీలో పనిచేస్తు న్నాడు, తెలుసుకదూ? రెండోరోజు ప్రొద్దునే ప్లేనులో వచ్చాడు శ్యామలా దానిభర్తా మధ్యాహ్నానికల్లా రాగలిగారు ఆతర్వాతే దహనసంస్కారాలు జరిగాయి ఈ మూడు రోజుల్నించీ వాళ్ళ ఆర్త నాదాలు వింటుంటే నేనూ దుఃఖం ఆపుకోలేకండా వున్నాను ముఖ్యంగా మావయ్యని చూస్తుంటే గుండెలు ద్రవించిపోతున్నాయి ఇప్పుడు బంధువు లంటే ఎవరెవరో వున్నారు రేపు అంతా వెళ్ళిపోయాక వొంటరేగా? అమ్మ లాగే అత్తయ్యమీద కూడా నాకు కోపం వచ్చింది వృద్ధాప్యంలో మొగుళ్ళ నిలా వొంటరిగా వొదిలి ఎందుకు వెళ్తారు! చెల్లాయి! అంతా భగవదేచ్ఛ మన చేతిలో ఏముందీ? నువు మాత్రం ఈ విషయంలో ఏమీ బాధపడబోకు ఏం?

అం ఒక మంచివార్త కూడాను నీకు రాయాలి అనుకుంటూనె మరిచిపోతు న్నాను ఈ మధ్యే మా ఆఫీసరు మారి కొత్త ఆఫీసరు వచ్చాడు, పేరు కృష్ణమ్మ మగవాడేలే ఆ ఆడపేరెందుకో 'కృష్ణ' అంటే సరిపోదూ? చిన్నవాడే ముప్పైకి లోపునే వుంటాయి అప్పుడే డాక్టరేట్ కూడా చేశాట్ట మనిషి ఎంత అందంగా హుందాగా వుంటాడనుకున్నావ్? ఎంత చూసినా తనివితీరదు నన్ను ఆయ నకి స్టెనోగా వేశారు నాకు ఒక్కటే భయం ఆయనముందు కూచుని డిక్టేషన్ తీసికుంటూన్నప్పుడు ఆయన చెప్పేది

బుర్రకెక్కక ఏం తప్పులు చేస్తానో, నన్నెక్కడ ఆ పోస్టునించి తొలిగిస్తారో నని, ఎంత జాగ్రత్త పడుతున్నా అప్పు డప్పుడు చిన్నచిన్న పొరపాట్లు జరుగు తూనే వున్నాయి. అయినా ఆయన ఏమీ అనరు. మందహాసంతో మంద లిస్తారు. అంతే...ఉంటాను.

బాబుకు ముద్దులు
నీ
విశాల

6

విజయపురినార్త్
2 వ మార్చి 1961

అక్కయ్యా !

నీ జాబు నన్నెంతగా ఆందోళనపరిచి నదో చెప్పలేను. అత్తయ్యపోయినదంటే నమ్మలేకుండా వున్నాను. డాక్టరు మామయ్యకూడా నాన్నగారివలెనే అయి పోతాడేమోనని నాకు భయముగా నున్నది. శ్యామలని ఓదార్చడానికైనను రావలెనని ఉన్నది. కాని ప్రస్తుతము ధానికి వేరే ఒక జాబు వ్రాస్తున్నాను.

నీ ఉత్తరములో నీ పెళ్ళిగురించిగాని, సుందర్రావుగారి గురించిగానీ లేకపోవ డము ఆశ్చర్యకరముగా వున్నది. నీ క్రొత్త ఆఫీసరు గురించి నీవు అట్లా వ్రాయుటకూడా భావ్యముగా లేదు. నిర్మొగమాటముగా చెప్పవలెనంటే నీవు అసలు ఉద్యోగము చేయుటయే మాకు ఇష్టములేదు. అక్కయ్యా నీ మాటనుంచి



"నీ జీవితంలో ఈ రోజులాంటి రోజు మళ్ళీ రాదోయ్."
"నా పెళ్ళి ఈ రోజు కాదోయ్. రేపు."
"కనుకనే."

నీవు తిరిగిబోక. వెంటనే పెళ్ళిచేసుకో వలెనని నాకూ మీ మరిదిగారికీ ఎంత ఆదుర్దాగా నున్నదో నీకెట్లా తెలియ జెయ్యవలెనో తోచడములేదు. మన్నించె దవుకదూ ?

ఇట్లు
నీ శ్రేయోభిలాషి చెల్లాయి
విజయ

7

హైద్రాబాద్
10-3-61

విజ్జీ !

నా పెళ్ళిగురించి మీ ఆదుర్దాచూస్తే నాపైన నాకే జాలి వేస్తోంది సుమా. నేనో నేరస్తురాలికి మల్లే, ఫీలవుతూ న్నాను. మీ వుద్దేశంలో కేవలం నాకు

పెళ్ళికావటమే ప్రధానంగా వున్నట్టున్నది, ఎవరితోనైనా సరే, ఆఖరికి మన నౌకరు శాయన్నతోనైనా సరే: ఆ మాటకొస్తే, ఒక్క స్టేటస్ మినహా శాయన్నకేం విటి లోటు? వాడిలోవున్న దయా, ఆత్మ విశ్వాసం ఆ సుందరరావులో ఏదీ? వుత్త వ్యక్తిత్వం లేనిమనిషి, ఆడదాని కొంగుచాటున బ్రతికే అర్భకుడు. నా వెంట తిరుగుతూ నా నోటిమాట పూర్తవకుండానే అవునంటూ తలూపి తాళం వేసేవాడు. అలాంటి పెంపుడు కుక్కను పెళ్ళి చేసికోవటం నాకు అసహ్యం. అందుకని ఆ ప్రసక్తే మాను కున్నాను. అసలు అతనితో స్నేహితమే వదులుకున్నాను.

మరదిగారు కూడా నా పెళ్ళికోసం తాపత్రయపడిపోతున్నారా? ఆయన కోర్కె ఎలాతీర్చనూ? పోనీ నువ్వు నాకంటే పెద్దదానివేనా అయివుంటే, ఏ దిక్కూలేక ఆఖరికి అక్క మొగుడే దిక్కు అన్నట్లు మీ ఆయన్నే కట్టుకునేదాన్ని. అయినా ఇప్పుడు 'లా' దానికి వొప్పు కోదేమోలే.

చూడు చెల్లాయి! ఈ వేళాకోళపు మాటలకేంగాని, పెళ్ళంటే పిల్లలాట కాదు. ముందూ వెనకా ఆలోచించి మరీ చేసికోవాలి. తొందరపడితే ఎలా? నేనేమీ మాట తప్పించటంలేదు. తప్ప కండా చేసికుంటాను. కాని తగినవరుడు కనిపించొద్దూ?... ఆఁ, అలాంటివరుడు నా కళ్ళలో మెదులుతూనే వున్నాడు. ఎవ్వరో నువ్వేవూహించగలిగివుంటావు. మా కొత్త ఆఫీసరు. రోజు రోజుకూ ఆయనకు నా పైన ఆప్యాయత ఎక్కు వవుతూన్నట్లుగానేవుంది. తాను కాఫీతాగే సమయానికి డిక్టేషన్‌కని పిలిపించి నాకూ ఇస్తాడు. 'ఇలా ఎన్నాళ్ళు ఋణపడి పోతూవుండాలని' అడిగితే నవ్వివూర్కుం టాడు. మా ఇంటికి ఒకసారి టీకి రమ్మని ఆహ్వానించాను. సరేనన్నాడు. వచ్చే ఆది వారం వస్తాట్ట. చూడాలి ఏమవుతుందో ఆయన అవునంటే నా జన్మ తరించి పోతుంది. నీకు భగవంతునిపైన భక్తి వుందికదూ? నాకోసం ప్రార్థించు. ఉంటాను.

నీ ప్రియమైన అక్కయ్య

విశాల

P S — నేననుకున్నట్లుగానే డాక్టరు మాఁవయ్య వొంటరివాడైపోయాడు. అంతా వెళ్ళిపోయారు. కాని మూర్తి మళ్ళీ వస్తాడుట శలవుపెట్టి. వీలైతే సికింద్రా బాద్‌కే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటాట్ట. శ్యామల కూడా పిల్లలబళ్ళు మూయగానే వస్తానంది

విశాల

## 8

విజయపురి నార్త్
16 వ మార్చి 1961

అక్కయ్యా,

నీ మాటలకు నేను నొచ్చుకోవలెనో లేదో తెలియకుండావున్నది. నీ బాగోగులు

నీవే చూచుకునే సమర్థత నీకు ఉన్నదని నాకు తెలుసు. నీకు నచ్చిన వరుణ్ణి నీ ఇష్టము వచ్చినప్పుడే పెళ్ళిచేసుకోగలవు. నేనిక తొందరపెట్టను.

అప్పుడప్పుడు ఉత్తరములు వ్రాస్తూ వుండుము. అంతేచాలు

ఇట్లు
నీ చెల్లెలు
*విజయ*

## 9

విజయపురి నార్త్
10 వ మే 1961

ప్రియమైన అక్కయ్యకు,

దాదాపు రెండునెలల క్రితము నీ కొక ఉత్తరము వ్రాసి వుంటిని. అందులో అప్పుడప్పుడు అక్కడి సంగతులు తెలియజేయవలసినదిగా కోరివుంటిని. కాని నీ దగ్గరనుంచి ఒక్క ఉత్తరమూ రాలేదు. దయచేసి వెంటనే వ్రాయగలవు. నామీద కోపము రాలేదుకదా ?

ఇట్లు
నీ చెల్లాయి
*విజయ*

## 10

హైద్రాబాద్
14-5-61

మైడియర్ విజయా!

నీమీద నాకు కోపమా ? ఎంత మాటన్నావ్ ? అలా ఎన్నటికీ జరగదని నీకు నమ్మకంలేదా ? నువ్వు నా కంటే చిన్నదానివే అయినా బుద్ధిమంతురాలివి. నువ్వు చెప్పేదంతా నా శ్రేయస్సును కోరేనని నాకు తెలీదా! నీ సలహాల్ని నే నెప్పుడూ గౌరవప్రదంగానే చూస్తాను. ఇదిగో, ఇప్పుడే నీ కోర్కెనొకదాన్ని తీర్చేశాను కూడాను. ఏఁవిటో చెప్పుకోగలవా ? నా వుద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. కారణాలు ఏవైతేనేఁ, నీ అభిలాష అదేకదూ ?

మూర్తి రెండునెలల శలవు మీద వచ్చి ఇక్కడే వున్నాడు. శ్యామలకూడా వుంది. వొచ్చేనెల్లో బళ్ళు తెరవగానే వెళ్ళిపోతుందట. అప్పటికి మూర్తి శలవుకూడా అయిపోవచ్చు. ఇంట్లో ఆడ దిక్కు వుండదని ఎలాగైతే మూర్తికి త్వరలో పెళ్ళిచెయ్యాలని ఆరాటపడుతున్నాడు డాక్టరు మాఁవయ్య కాని మూర్తిమాత్రం ఇప్పుడప్పుడే పెళ్ళి చేసికోనంటున్నాట్ట. కాని సికింద్రాబాదుకు బదలీ ప్రయత్నాలు మాత్రం చేస్తూనేవున్నాట్ట. మూర్తిని నువ్వెప్పుడు చూశావో, ఇప్పుడు పూర్తిగా మారిపోయాడుసుమా. అప్పుడే అచ్చంగా పైలట్ — ఆఫీసరులా తయారయాడు. మీసాలుకూడా పెంచాడు. ముందుముందు నిజంగానే పైలట్ అవొచ్చుట.

బాబుమా ఉంచేశావ్ ? పోనీ, అంత పెద్ద ప్రాజెక్టేకదా, అక్కడ (Kinder-

garten) స్కూలులాంటిదేం లేదా? వుంటే వెంటనే చేర్పించెయ్యి.

ఉంటాను.

నీ ప్రియమైన అక్కయ్య
విశాల

## 11

విజయపురినార్త్
20 వ మే 61

అక్కయ్యా,

నీ వుత్తరములు ఒకదానికంటే మరొకటి అయోమయముగా ఉంటున్నవి. నాకెటూ పాలుపోవటము లేదు. మీ క్రొత్త ఆఫీసరు నీకు అన్నివిధాలా నచ్చినట్టున్నాడుకదా, ఇకనైనను శుభవార్త వినిపించెదవుకదా అని ఆశిస్తూ వుంటే, ఆ ఉద్యోగానికే రాజీనామా ఇచ్చినట్టు వ్రాసినావు. ఆ పని కేవలము నా కోరికపైనే చేసినావంటే నమ్మలేకుండా వున్నాను. ఏదో జరిగి ఉంటుంది. నావద్ద దాస్తున్నావు. నేను పరాయిదాన్నా? ఉన్నది ఉన్నట్లుగా వెంటనే వివరాలు వ్రాయగలవని ప్రార్థన.

ఇట్లు
నీ చెల్లాయి
విజయ

## 12

హైద్రాబాద్
1-6-61

విజయా!

నీ 20 వ మే వుత్తరం రెండోరోజే చేరింది. కొన్ని కొన్ని కారణాలవల్ల వెంటనే జవాబు రాయలేక పోయాను.

నా వుద్యోగాన్ని గురించి వివరాలు రాయమన్నావు. ఏంరాయనూ? ఆ ఆఫీసరుపైన నేను పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలైనాయి. నీకు రాశానో లేదో ఆయన్ని ఒకసారి మనింటికి టీకి ఆహ్వానించాను. రెండు వారాలు రలాయించి మూడోవారం వచ్చాడు. కాని వొంటరిగా రాలేదు. వెంట వొక అప్సరలాంటి స్త్రీ కూడా ఉంది. నా మనస్సు చివుక్కుమంది. ఆమెను తన భార్యగా పరిచయం చేసేసరికి నాకు మూర్ఛవచ్చినంతపనైంది ఇంక మిగిలిందేమిటి? రెండోరోజే రాజీనామా పంపించేశాను. అదంతా ఒక పీడకలగా మరిచిపోదలచాను. మరిచిపోగలిగాను కూడాను. ఇప్పుడు నాకే బాధా లేదు.

అయితే చెల్లాయ్! ఇక నా పెళ్ళి విషయంలో నిన్నూ మీ ఆయన్నూ ఆట్టే విసిగించదలచుకోలేదు. మీరు ఆశిస్తూన్న శుభవార్త అందజేస్తూనే వున్నాను... నాకు పెళ్ళి స్థిరపడిపోయింది... అవును విజ్జీ! నిజమే. ఈసారికిక తిరుగులేదు. అతి త్వరలోనే వివాహం జరిగిపోవొచ్చు కూడాను. మూర్తి వొప్పుకున్నాడు. శ్యామలకు సమ్మతంగానేవుంది, డాక్టరు మాటవయ్య మొదట కొస్త మొరాయించినా, తర్వాత సరేనన్నాడు. నాన్నారితో చెప్పాను. ఆయన ఎప్పటిలాగే ఏమీ మాట్లాడలేదు. తమ్ముడికి రాసే

స్తున్నాను. మీకూ అభ్యంతరం వుండదనుకుంటాను. పెళ్ళికి వస్తారుకదూ?

నీ ప్రియమైన
విశాల

## 13

విజయపురినార్త్
4 వ జూన్ 1961

అక్కయ్యా, అక్కయ్యా,

నేను సంతోషము పట్టలేకుండా ఉన్నాను అక్కయ్యా. నీ ఉత్తరములోని మూడవ ప్యారా ఇప్పటికి ఒక పది సార్లైనను చదివి ఉంటాను నా కళ్ళని నేనే నమ్మలేకుండా ఉన్నాను. నీ ప్రతి ఉత్తరములోనూ ఏదో ఒక మెలిక పెట్టి నన్ను కలవరపెట్టే నీవు ఇంత త్వరలో ఈ నిశ్చయానికి వచ్చెదవని నాకు నమ్మకము లేకుండా వుండినది. నా ప్రియమైన అక్కయ్యను అమాంతముగా కౌగిలించుకొని ముద్దులవర్షము కురిపించవలెనని ఉన్నది. త్వరలోనే ఆ పని చేస్తానులే. కాని అక్కయ్యా, ఇదేమి ప్రశ్న? మేము పెళ్ళికి వస్తామా అని వ్రాసినావే? రాక? అసలు మేము రాకుండా పెళ్ళి ఎట్లా జరుగుతుంది? మావారిని శలవుపెట్టెయ్యమని చెప్పేసినాను. నేనుకూడా పెట్టె సర్దటము మొదలెట్టేసినాను అయినా అంత రొందరేమిటీ? బహుశా మూర్తి బావకు శలవులు అయిపోవచ్చినాయేమో. ఇంకొంచెము పొడిగించుకోమనరాదా? కనీసము పదిహేను రోజుల గడువేనా కావద్దా? పెళ్ళంటే మాటలా?

మాకు అభ్యంతరము ఉంటుందేమో నన్న అనుమానము నీకెందుకు కలిగినదీ? నీకునచ్చినవరుడు ఎవరైననూసరే మాకు ఇష్టమేనని నేను ఇదివరకే వ్రాయలేదా? దీనితో ఇన్నాళ్ళూ స్నేహముగా నున్న మనరెండు కుటుంబాలు బంధుత్వములో ఏకమైపోవును కదా? ఎటొచ్చీ మూర్తి బావ నీకంటే పెద్దవాడో చిన్నవాడో నాకు తెలియదు. అయినా అదంత ముఖ్యమైన విషయము కాదు. మీరుభయులూ ఇష్టపడినారు. అంతేచాలు తేదీ నిర్ణయము కాగానే వ్రాయగలవు. వెంటనే వచ్చేస్తాను.

ఇట్లు
నీ విజయ

## 14

హైద్రాబాద్
7-6-61

ప్రియమైన విజయకు,

క్షమించాలి చెల్లాయ్! సమాయానికి మిమ్మల్ని పిలిపించుకోలేక పోయాను. మొన్న అయిదవ తారీకున ఆకస్మాత్తుగా మా పెళ్ళి జరిగిపోయింది. అయితే మీ రనుకున్నట్టు మంగళ వాద్యాలతో, బంధుమిత్రుల సమక్షాన, పెళ్ళి పందిట్లో జరుగలేదు. అసలు ఆ తతంగమంటే నాకు మొదట్నించీఇష్టంలేదు. అందులో ఈ పెళ్ళి అలా వైభవంగా జరుపుకోటం భావ్యంగా తోచలేదు. అందుకని రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ పెళ్ళి చేసేసుకున్నాం.

ఆ సాయంత్రం మాత్రం కొందరు పరిచయస్తుల్ని అల్పాహారానికి ఆహ్వానించాం. అప్పటికైనా మిమ్మల్ని పిలిపించుకునే వ్యవధి లేకపోయింది. అసలు ఆ నాటి ప్రొద్దుటివరకూ నిశ్చయమే కాలేదు. మూర్తి శలవుల extension కోసం దరఖాస్తు పంపించాడు. వస్తుందనే ధీమాతో వున్నాం. కాని ఆ రోజు ప్రొద్దున్నే టెలిగ్రాం వచ్చింది శలవు reject చేస్తూ. ఇక గత్యంతరం లేక ఆ రెండోరోజే వెళ్ళిపోతానన్నాడు. బళ్లు తెరుస్తారు, తానూ వెళ్తానంటూ శ్యామల కూడా గోలపెట్టింది. ఇద్దరు పిల్లలు వుండగానే ఈ పనిజరిగిపోవాలని పట్టుపట్టాడు డాక్టరు మావయ్య. దాంతో వెంటనే వెళ్ళి రిజిస్టరీ పెళ్ళి చేసేసుకున్నాం. రెండోరోజు, అంటే నిన్న సాయంత్రమే మూర్తీ, శ్యామలా ఇద్దరూ వెళ్ళిపోయారు. ఇవ్వాళ్ళ తీరిగ్గా నీకు వుత్తరం రాద్దామని కూచున్నాను. ఇంతలోకి నీ వుత్తరంకూడా అందింది.

మీకు అభ్యంతరం వుండదని నాకు తెలుసు, సంతోషం. కాని అదేఁవిటి? మూర్తి ప్రాయానికీ నాదానికీ పోల్చావేఁ? కొంపదీసి నేను మూర్తిని పెళ్ళిచేసికోబోతున్నా ననుకున్నావా? రామ రామ. అయితే నా వుత్తరంలో నేను స్పష్టంగా రాయనేలేదా? ఎంత పొరపాటు...... విజయా! నేను పెళ్ళిచేసుకుంది మూర్తిని కాదు, వాళ్ళనాన్న డాక్టరు మావయ్యని.

చూడు విజ్జీ! నిజంగా, నే నీవిషయం నా క్రిందటి వుత్తరంలో స్పష్టంగా రాయకపోతే అది పొరపాటే అందుకని నీకీ news షాక్ తగిలించొచ్చు. కాని కాస్త నిమ్మళంగా ఆలోచిస్తే నువ్వునాతో ఏకీభవిస్తావని నాకు నమ్మకంగావుంది. ఈ రెండు నెలల్లోనూ మావయ్యను చూస్తుంటే నాకు అదోలావుంటోంది. నాన్నా ఇలాగే తయారవుతాడేమోనన్న భయం నన్నుపట్టుకుంది అటు మావయ్యనీ ఇటు నాన్నగారినీ శూన్యంలోకి జారి పోనీకండా కాపాడే బాధ్యత నామీదే వున్నట్టుగా తోచింది. అందుకు ఇదొక్కటే మార్గం కనిపించింది. అవలంబించాను.

అయినా నేను పొరపాటే చేశానని మీరు భావిస్తే, నువ్వు సుహృదయురాలవి, నన్ను క్షమించు. వీలుంటే మీ ఆయన్నికూడా నన్ను క్షమించమని నా తరపున ప్రార్థించు.

నీ ప్రియమైన
విశాల

## 15

విజయపురి నార్త్
12 వ జూన్ 1961

విశాలా,

నీ జాలిగుండెకు జోహారులు! కాని నీ ఈ త్యాగానికి మేము ఎంత మాత్రము హర్షించలేము.

ఇట్లు
విజయ ★